

డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో అందరూ భాగస్వామ్యం కావాలి

- మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేయాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపడుతున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్'ను బుధవారం హైదరాబాద్ బేగంపేటలో మెట్రో రైల్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తామని ప్రతిజ్ఞలో తెలిపారు. అనంతరం మెట్రో ఎండి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో క్రియాశీల భాగస్వామి అవుతున్నట్టు చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములం అవుతామన్నారు.

యెజ్డి 'రోడ్‌స్టర్ 2025' ఆవిష్కరణ

న్యూఢిల్లీ : యెజ్డి మోటార్ సైకిల్ కంపెనీ తన రోడ్‌స్టర్ 2025ని ఆవిష్కరించింది. దీని ఎక్స్ షోరూం ధరను రూ.2.10 లక్షలుగా నిర్ణయించింది. ఈ కొత్త బైకును మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాతో కలిసి యెజ్డి మోటార్‌సైకిల్ కోఫౌండర్ అనుపమ్ థరేజా విడుదల చేశారు. 2025 యెజ్డి రోడ్‌స్టర్‌లో ఆల్ఫా2 ఇంజిన్ ఉంది. ఇందులోని 334 సిసి సింగిల్ సిలిండర్ లిక్విడ్ కూల్డ్ యూనిట్ 29.1 హార్స్ పవర్, 29.6 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది.

ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌కు రూ.10 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 44.4 శాతం వృద్ధితో రూ.10.4 కోట్ల నికర లాభాలు సాధించినట్లు ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ తెలిపింది. తొలిసారి రూ.3 వేల కోట్ల వార్షిక రెవెన్యూను దాటినట్లు పేర్కొంది. గడిచిన క్యూ1లో రూ.27.5 శాతం పెరుగుదలతో రూ.777.4 కోట్ల రెవెన్యూ నమోదు చేసినట్లు తెలిపింది.



షారుక్‌తో సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ కొత్త క్యాంపెయిన్

హైదరాబాద్ : బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌తో నూతన క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ తెలిపింది. ఈ క్యాంపెయిన్ రోజువారీ క్షణాలకు ఆనందాన్ని జోడిస్తుందని ఐటిసి ఫుడ్స్ డివిజన్ బిస్కెట్స్ అండ్ కేక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హర్రిస్ షేర్ పేర్కొన్నారు. డార్క్ ఫాంటసీ చాకో ఫిల్స్, మోల్టెన్ చాకో, సింగిల్ సర్వ్ ప్యాకేజింగ్‌తో పిల్లలు, ప్రొఫెషనల్స్ టిఫిన్‌లకు ఆహ్లాదకరమైన తీపి అనుభవాన్ని అందిస్తుందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీకాంత్

22 నుంచి హైటెక్స్‌లో స్పోర్ట్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - హైదరాబాద్

స్పోర్ట్స్ ఎక్స్‌పో ఇండియా 8వ ఎడిషన్ ఆగస్ట్ 22, 23 తేదీల్లో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనుంది. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైటెక్స్ బిజినెస్ హెడ్ టిజి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ ఎక్స్‌పో దేశంలోని ప్రముఖ బి2సి క్రీడలు, ఫిట్‌నెస్, వెల్‌నెస్, న్యూట్రిషన్ రంగాల ఈవెంట్‌గా నిలుస్తుందన్నారు. ఈ సంవత్సరం ప్రత్యేక ఆకర్షణగా ఈ-స్పోర్ట్స్ ఎక్స్ పావిలియన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నామన్నారు. దాదాపు 35 వేల నుంచి 40 వేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. క్రీడా ఔత్సాహికులకు, ఫిట్‌నెస్ ప్రియులకు ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు.

భూధార్ నెంబర్ల కేటాయింపుపై దృష్టి సారించాలి

- మ్యుటేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
- సౌకర్యవంతంగా ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సిఎం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో అధికారులు స్వీకరించిన వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. లైసెన్డ్ సర్వేయర్లు సర్వే చేసిన తర్వాత కూడా రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాల్లో నూతనంగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సిఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందనే విషయాన్ని అధికారులు ఈ సందర్భంగా సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆయన వారికి సూచించారు. హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సిసిఎల్ఎ కార్యదర్శి డిఎస్ లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై టాస్క్‌ఫోర్స్ కమిటీ

- జనావాసాల నుంచి ఫార్మా, డ్రగ్ కంపెనీల తరలింపుపై కసరత్తు
- పిసిబి సమీక్షలో మంత్రి కొండా సురేఖ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పర్యావరణ పరిరక్షణ ఉల్లంఘించే ఫార్మా, డ్రగ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం తరపున టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. ఆ కమిటీలో ఒక ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, రెవెన్యూ అధికారులను, పర్యావరణ పరిరక్షకులను, సెంట్రల్ పిసిబి అధికారులు ఉంటారని తెలిపారు. జనావాసాలున్న చోట నుంచి ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీల తరలింపుపై కసరత్తు చేయాలని ఆదేశించారు. సిఎం రేవంత్ రెడ్డి కూడా ఔటర్ రింగు రోడ్డు అవతలనే ఫార్మా కంపెనీలుండాలని చెప్పారనీ, ఆ మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. అందులో అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పిసిబి మెంబర్ సెక్రటరీ రవి, సిఇ రఘు, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, వెంకన్న, రవిశంకర్, పోచంపల్లి, చౌటుప్పల్, చిట్యాల ప్రాంతాల నుంచి వచ్చిన పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ముందు ఉన్న కేసులు, సిపిసిబికి అందిన ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూగర్భజలాలు కలుషితం కాకుండా ఉండేందుకు తాము అనుసరిస్తున్న పద్ధతులను పలు కంపెనీల ప్రతినిధులు వివరించారు.కొన్ని పరిశ్రమల ప్రతినిధులు సమావేశానికి రాకపోవడంపైనా, మరికొన్ని పరిశ్రమలు కిందిస్థాయి ప్రతినిధులను పంపడంపైనా మంత్రి సురేఖ తప్పుబట్టారు. పరిశ్రమల అనుమతుల్లో ఉదాశీనత సరికాదనీ, ఎక్కడైనా ఇష్టారీతిన వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చౌటుప్పల్ ఏరియా నుంచి పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్యంపై విపరీతమైన ఫిర్యాదులు రావడమేంటని ప్రశ్నించారు. వాటిపై చాలా కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమల అనుమతుల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతుండటంతో పిసిబి ఉన్నతాధికారుల తీరుపై మంత్రి ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేని, అనుమతుల టైం అయిపోయిన కంపెనీలను ఎన్నిసార్లు రైడ్స్ చేశారు? గ్రౌండ్ వాటర్ కలుషితమవుతున్న స్టేటస్ తీరును ఎప్పటికప్పుడు చెక్ చేస్తున్నారా? లేదా? గ్రౌండ్ వాటర్ కలుషితమైన ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ డ్రైవ్ చేపించారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంతటి వారైనా పర్యావరణ పరిరక్షణ ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతి ఆరు నెలలకోసారి తనిఖీలు చేస్తున్నామని, కంప్యూటరైజ్డ్ తనిఖీల ప్రక్రియ కూడా చేపట్టామని పీసీబీ మెంబర్ సెక్రటరీ జి.రవి వెల్లడించారు. అనంతరం మళ్లీ మంత్రి సురేఖ మాట్లాడుతూ..నీటి కాలుష్యం పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలనీ, దానికి సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు.

ఇంజనీరింగ్ సీటు రద్దు చేసుకునే అవకాశమివ్వాలి

- ఫీజులు, సర్టిఫికెట్లను ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎప్‌సెట్ ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని నచ్చని కాలేజీలో సీటు వచ్చిన విద్యార్థులు ఆ సీటు రద్దు చేసుకునే అవకాశం కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ సీటును రద్దు చేసుకుని ఇతర కోర్సుల్లో చేరేందుకు అవకాశం లేకుండా చేయడం సరైంది కాదని తెలిపారు. ఈ నిబంధనను ఉపయోగించుకుని కొన్ని ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలు తప్పనిసరిగా చదవాలనీ, లేకపోతే ఫీజులు, సర్టిఫికెట్లను వెనక్కి ఇవ్వబోమంటున్నాయని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల ఫీజులు, సర్టిఫికెట్లను ఇవ్వని కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎప్‌సెట్ రెండో విడతలో సీటు పొందిన విద్యార్థులు కేటాయించిన కాలేజీలో రిపోర్టు చేసిన తర్వాతే మూడో విడత కౌన్సెలింగ్‌కు అర్హులని తెలిపారు.

క్విట్ ఇండియాడే స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ డే

- కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు
- నారాయణగూడ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నారాయగూడ చౌరస్తాలో ధర్నా చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్రోద్యమ కాలంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ కార్పొరేట్ డేను నిర్వహిస్తున్నామని కేంద్ర కార్మిక సంఘాల, ఎస్‌కేఎం, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు చెప్పారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త పిలుపులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని నారాయగూడ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, ఎస్‌వి రమ, కె ఈశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, ఎం. పద్మశ్రీ, కూరపాటి రమేష్, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, మండలి వెంకన్న, నాగిరెడ్డి, అరుణప్రసాద్, రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎం.శోభన్‌నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, టీయూసీఐ రాష్ట్ర నాయకులు ప్రవీణ్, ఎస్ఎల్.పద్మ, ఐఎఫ్‌టీయూ నేత అనురాధ, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సోమన్న, ఎ. సునీత, జె. కుమారస్వామి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బి.వెంకటేశం, కమతం యాదగిరి, బొడ్డుపల్లి కిషన్, సిహెచ్. జంగయ్య, అశోక్, మల్లేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.వీరయ్య, బాలరాజ్‌గౌడ్, సాగర్, పద్మ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమానికి ముందు బ్రిటీష్ సామ్రాజ్యవాదులు సుమారు 200 ఏండ్లు మన దేశాన్ని పాలించి కార్మిక, రైతాంగ, సాధారణ ప్రజల్ని పీల్చి పిప్పి చేశారని, నాటి దుర్మార్గ విధానాలు, చట్టాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందని గుర్తుచేశారు. నేటి బీజేపీ పాలకులు కూడా బ్రిటీష్ సామ్రాజ్యవాదుల మాదిరిగానే కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు అధిక లాభాలు కట్టబెట్టేందుకు కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్నదని తెలిపారు. మరోవైపు పాడి, మొక్కజొన్న, సోయా వంటి మొదలు వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి ద్వారాలు తెరవడం వల్ల మన దేశంలోని సన్న, చిన్నకారు రైతులకు నష్టదాయకమని నొక్కి చెప్పారు. బిజెపి పాలకులు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.

సెమీ కండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో

కేంద్రం వివక్ష

- రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణకు రాజకీయ అక్కసుతోనే కేంద్రం అన్యాయం చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో వివక్ష చూపించిందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. 'ప్రపంచ స్థాయి అధునాతన సిస్టమ్ అండ్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో పదెకరాల భూమి కేటాయించాం. అన్ని రకాల సబ్సిడీలకు ఆమోదం తెలిపాం. రికార్డు సమయంలో అన్ని అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తుది ఆమోదం లభిస్తే పనులు మొదలు పెట్టేందుకు సదరు ఇన్వెస్టర్ సిద్ధంగా ఉన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు' అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

ఎపికెలా కేటాయిస్తారు..?

అన్ని రకాలుగా అర్హతలున్నా తెలంగాణను విస్మరించి కనీస సంసిద్ధత లేని ఏపీకి ప్రాజెక్టును ఎలా కేటాయిస్తారని శ్రీధర్ బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. 'తర్కానికి అందని, న్యాయ విరుద్ధమైన ఈ నిర్ణయం పెట్టుబడిదారులకు తప్పుడు సంకేతాలను పంపే ప్రమాదముంది. ఇలాంటి రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు దేశ పారిశ్రామికాభివృద్ధికి మంచిది కాదు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మరోసారి పున:పరిశీలించాల్సిన అవసరముంది. వాస్తవ పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని తెలంగాణకు మేలు చేసేలా నిర్ణయం తీసుకోవాలి' అని మంత్రి డిమాండ్ చేశారు.

కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలి...

'కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సవరించాలి. న్యాయం జరిగేలా చొరవ చూపాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన తెలంగాణ బీజేపీ ఎంపీలు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికీ స్పందించకపోతే తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారు' అని శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

- అనలిటిక్స్ ఇండియా జాబితాలో చోటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ 2025' జాబితాలో చోటు లభించింది. సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తూ భారత్‌ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఇందులో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సిఇఒ, ఎస్‌పీసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పిసిఐ సిఇఒ దిలీప్ అస్బే, నీతి ఆయోగ్ మాజీ సిఇఒ అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షులు దేబజాని ఘోష్ తదితర ప్రముఖులను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు.

పర్యాటకాభివృద్ధికి కృషి

- టూరిజంతో కలిసి పని చేయనున్న పోలీసుశాఖ
- రాష్ట్ర డిజిపి జితేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి పోలీసు శాఖ కూడా సంయుక్తంగా కృషి చేస్తున్నదని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. అందుకు తగినంత మంది సిబ్బందిని త్వరలో కేటాయిస్తామని చెప్పారు. బుధవారం డీజీపీ కార్యాలయంలో పోలీసు, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి శాఖ, సినిమా రంగాలకు చెందిన అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడారు. "పర్యాటకాభివృద్ధికి ఆ శాఖ తీసుకునే కార్యాచరణకు పోలీసుశాఖ కూడా భుజం కలిపి నడుస్తుంది. ముఖ్యంగా రాష్ట్రంలోని కీలకమైన పర్యాటక ప్రదేశాల్లో విదేశీటూరిస్టులకు అవసరమైన భద్రతను కూడా తమ శాఖ కల్పిస్తుంది. తొలి దశలో టూరిజం శాఖకు అవసరమైన 80 మంది పోలీసు సిబ్బందిని త్వరలో కేటాయిస్తాం. సెప్టెంబర్ 27న జరగనున్న వరల్డ్ టూరిజం డే సందర్భంగా టూరిస్ట్ పోలీసుల వ్యవస్థ సిద్ధం చేయాలని భావిస్తున్నాం. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలైన అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరిగుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్, బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ తదితర ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీసులు పని చేస్తారు. షూటింగ్ పర్మిషన్లు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం పర్యాటక శాఖ విధి విధానాలను రూపొందించాలి" అని డీజీపీ సూచించారు.

తెలంగాణలో టూరిజం అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టనున్నామని పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ అన్నారు. "ఇక్కడి పర్యాటకులతో పాటు విదేశీ టూరిస్టులకు భద్రత కల్పించేందుకు టూరిస్ట్ పోలీసు అవసరం ఉన్నది. ఆధ్యాత్మిక, మెడికల్, వినోదాత్మక పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చేవారి భద్రత కోసం టూరిస్ట్ పోలీసులను కేటాయించాల్సి ఉన్నది" అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేశ్ భగవత్, టూరిజం శాఖ ఎండి వి క్రాంతి, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి సిహెచ్ ప్రియాంక, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

'స్త్రీనిధి'పై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్త్రీనిధి సంస్థ ప్రయోజనాలను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో స్త్రీనిధి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి సీతక్కను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న వడ్డీ లేని రుణాల్లో స్త్రీనిధి రుణాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా మహిళల్లో సంస్థపై మరింత ఆత్మవిశ్వాసం పెరిగి సంస్థ బల పడటానికి దోహదపడుతుందని వివరించారు. సంస్థ నుంచి వైదొలిగిన పూర్వ ఉద్యోగులు స్వార్థపూరితంగా నిరాధారమైన దుష్ప్రచారాన్ని చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి తప్పుడు ప్రచారం వల్ల రుణ చెల్లింపులు తగ్గిపోయాయని తెలిపారు. సంస్థ ప్రతిష్టను దిగజార్చేలా కొంతమంది పనిగట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. స్త్రీనిధి సంస్థను బద్నాం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

టెన్త్ పరీక్షల విధానం మార్పులో కార్పొరేట్ శక్తుల కుట్ర : టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి విద్యార్థులకు సంబంధించి ప్రస్తుత విద్యాసంవత్సరం (2025-26) వార్షిక పరీక్షల విధానం మార్పులో కార్పొరేట్ శక్తుల కుట్ర ఉందని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు పాత పద్ధతిలో 20 శాతం ఇంటర్నల్ మార్కులు, 80 శాతం ఎక్స్‌టెర్నల్ మార్కుల విధానాన్ని కొనసాగించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నిర్ణయం వెనుక కార్పొరేట్ పాఠశాలల కుట్ర ఉందని విమర్శించారు. గతేడాది నుం అధికారుల తీరును గమనిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతున్నదని తెలిపారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దృష్ట్యా అని 100 మార్కుల పేపర్ ఉండాలని నిర్ణయించారని పేర్కొన్నారు. గ్రేడింగ్ విధానం తొలగించారనీ, ఆ తర్వాత పార్ట్ ఎ & బి 80:20 ఉండాలా లేక 70:30 ఉండాలా అనే అసంబద్ధమైన చర్చకు తెరలేపారని వివరించారు. ఆ తర్వాత పాత విధానంలోనే పదో తరగతి పరీక్షలు అని చెప్తూ, గ్రేడింగ్ లేకుండా చేయడానికి జరిగిన ఒక కుట్రలో భాగమే ఈ ప్రక్రియ అని విమర్శించారు. మార్కులు, ర్యాంకుల పేరుతో పెద్ద ఎత్తున వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించుకున్న కార్పొరేటు స్కూళ్ళకు గ్రేడింగ్ విధానం ఒక అడ్డుకట్ట వేసిందని తెలిపారు. దాన్ని తొలగించడానికి కార్పొరేట్ వ్యాపారుల ఎత్తుగడలకు విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలు అవకాశంగా మారాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించుకుని ఆ నిర్ణయాన్ని పున:సమీక్షించాలని సూచించారు. లేని పక్షంలో ఈ అంశం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలతో కలిసి ఐక్య పోరాటాలను చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను కార్పొరేట్ శక్తులపరం కాకుండా కాపాడుకోవడానికి ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.

భారత్‌పై అమెరికా సుంకాలతో తీవ్రనష్టం

- వెంటనే ఉపసంహరించాలి
- ట్రంప్ సేవకుడిగా మోడీ
- తెలంగాణకు జరిగే అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి : బివి రాఘవులు
- అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ లొంగొద్దు : జాన్‌వెస్లీ


అమెరికా సుంకాలపై వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న బివి రాఘవులు, జాన్‌వెస్లీ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలను విధించడం వల్ల తీవ్రనష్టం కలుగుతుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. అమెరికా విధించిన సుంకాలను వెంటనే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత్‌పై అమెరికా విధిస్తున్న టారిఫ్‌లకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శించి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాలతో తీవ్రనష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. భారత్ ఎగుమతులు చేసే వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలను మోపిందని వివరించారు. ఇప్పటికే ఎగుమతులు పడిపోయాయని అన్నారు. సుంకాల భారంతో విదేశాల్లో భారతీయ వస్తువులను ఎక్కువ ధరకు అమ్మాల్సి వస్తుందన్నారు. దీంతో కొనుగోళ్లు లేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఫార్మా పరిశ్రమ విస్తరించి ఉందన్నారు. సుంకాల పెంపుతో ఫార్మారంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. హైదరాబాద్ ఐటీ సేవలకూ నష్టం కలుగుతుందన్నారు. సుంకాల విధించడం వల్ల ఐటీ సంస్థలు నష్టపోతాయని అన్నారు. అమెరికా సుంకాల వల్ల ఐటీ పరిశ్రమ కుదేల్ అవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని చెప్పారు. సుంకాల విధించడం వల్ల రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం పడుతుందో ప్రభుత్వం ఓ పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను చైతన్య పరిచేందుకు, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ముందుకు రావాలని కోరారు. అమెరికా వస్తువులపై ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతి చేసుకోవాలంటూ మోడీ ప్రభుత్వంపై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. దీన్ని అంగీకరించాలా వద్దా?అనే దానిపై మోడీ సర్కారు తర్జనభర్జన పడుతున్నదని అన్నారు. జీరో సుంకాలతో అమెరికా వస్తువులను దిగుమతి చేసుకుంటే వ్యవసాయ ఉత్పత్తులు, పత్తి, గోధుమలు, సోయాబీన్, డెయిరీ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. తెలంగాణ ఎక్కువ నష్టపోతుందని చెప్పారు. జన్యుమార్పిడి విత్తనాలను దిగమతి చేసుకోవాలంటూ కార్పొరేట్ సంస్థలు ఒత్తిడి చేస్తున్నాయని విమర్శించారు. భారతీయ, తెలంగాణ విత్తన కంపెనీలు నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల నుంచి వ్యవసాయం, ఇతర వస్తువులను దిగుమతి చేసుకోవద్దంటూ కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌నకు సేవకుడిగా మోడీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భారత ప్రజలకు మోడీ సేవకుడిగా పనిచేయాలని సూచించారు. ట్రంప్ ఏం చెప్తే అది చేస్తున్నారని చెప్పారు. అమెరికా చెప్పడం వల్లే ఇజ్రాయెల్‌కు భారత్ మద్దతుగా నిలిచిందన్నారు. ట్రంప్‌ను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులు సవాల్ చేయాలని డిమాండ్ చేశారు. అమెరికాకు లొంగిపోవడమే దేశభక్తా?అని ప్రశ్నించారు. అమెరికా సుంకాలను వ్యతిరేకించడం, భారత ప్రయోజనాలను కాపాడ్డమే దేశభక్తి అని అన్నారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా సిపిఎం, వామపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. దొంగ ఓట్లు, బీహార్‌లో ఓట్ల తొలగింపుపై మాట్లాడుతున్న ప్రతిపక్ష పార్టీలు అమెరికా విధిస్తున్న టారిఫ్‌లపైనా స్పందించాలని కోరారు.

అమెరికా వస్తువుల దిగుమతిపై జీరో సుంకాలా? : జాన్‌వెస్లీ

ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం సాగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. సైనిక చర్యలు, ఆయుధవ్యాపారంతో దోపిడీ చేస్తోందని చెప్పారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై 50 శాతం సుంకాలు విధిస్తున్నదని అన్నారు. కానీ అమెరికా నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే వస్తువులపై జీరో సుంకాలుండాలంటూ మోడీ ప్రభుత్వంపై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ఫార్మారంగం, వ్యవసాయరంగం, లెదర్ పరిశ్రమ, కూరగాయలు, పాడి పరిశ్రమలకు నష్టం కలుగుతుందన్నారు. అమెరికా ఆంక్షలు విధిస్తుంటే మోడీ ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు. చైనాపై అమెరికా సుంకాలు విధిస్తే అమెరికాపై చైనా అదనపు సుంకాలను మోపి దీటైన సమాధానం చెప్పిందన్నారు. కానీ మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగి వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఇది దేశానికే అవమానకరమని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగిపోవడం సమంజసం కాదన్నారు. అమెరికాకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య, టి సాగర్, ఎండి అబ్బాస్, బండారు రవికుమార్, ఎండి జహంగీర్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యంతోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం మోటార్లతో రిజర్వాయర్లు నింపండి

- ఉత్తమ్‌కు హరీష్‌రావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం మోటార్లను ఆన్‌చేసి రిజర్వాయర్లు నింపాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఈమేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. రిజర్వాయర్లల్లో నీటిని సకాలంలో నింపకపోవడం వల్లే పంటల సాగు ముందుకు పోక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని గుర్తు చేశారు. ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్లు మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి సుమారు ఐదు లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్యాకెజ్-6 వద్ద గల మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

అన్ని రాష్ట్రాలకు హైడ్రా అవసరం

- బతుకమ్మకుంట సందర్శించిన ఢిల్లీ మున్సిపల్ అధికారులు


బతుకమ్మకుంటను పరిశీలిస్తున్న ఢిల్లీ మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైడ్రా వంటి సంస్థ ప్రతి రాష్ట్రంలోనూ ఉండాలని ఢిల్లీ మున్సిపల్ అధికారులు అన్నారు. అప్పుడే చెరువులు, నాలాలు, కాలువలు ఆక్రమణకు గురికాకుండా ఉంటాయన్నారు. హైదరాబాద్ అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను ఢిల్లీ మున్సిపల్ అధికారులు బుధవారం సాయంత్రం సందర్శించారు. చెరువు చుట్టూ తిరిగి.. అక్కడి అభివృద్ధిని పరిశీలించారు. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం సుందరీకరణ, చెరువులా రూపాంతరం చెందడాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఈ చెరువు నిర్మాణం జాతీయ స్థాయిలో చర్చకు వచ్చిందని బృందానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీ మున్సిపల్ హార్టికల్చర్ విభాగం అధిపతి డా. ఆశిష్ అన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించడం, మండు వేసవిలో రెండు మీటర్ల లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చిన వీడియోలను పరిశీలించారు. చెరువు చుట్టూ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీలో కూడా చెరువులు చాలా వరకు కబ్జాకు గురయ్యాయని, హైడ్రా వంటి సంస్థతో వాటిని పునరుద్ధరించడం, పరిరక్షించడం సులభం అవుతుందని అన్నారు. ఈ చెరువు పునరుద్ధరణ జరగనప్పుడు వరద ప్రభావం ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుకు ఆనుకుని సాగే మురుగు కాలువలోంచి వరద నీరు మాత్రమే వచ్చేలా ఇన్‌లెట్‌ను నిర్మించడాన్ని పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వరద నీరు ఎలా వచ్చి చేరిందో వీడియోల ద్వారా హైడ్రా అధికారులు చూపించారు. ఈ వరద నీరు గతంలో ఎటు వెళ్లేదని స్థానికులతో కూడా మాట్లాడి తెలుసుకున్నారు. వరద నీరు తమ బస్తీలను, కాలనీలను ముంచెత్తేదని, ఈ సారి ఆ ముప్పు తప్పిందని వారు వివ రించారు. చెరువు ఔట్‌లెట్లను ఢిల్లీ బృందం పరిశీలించింది. వారి వెంట హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, చెరువుల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్ ఎండి పి యూనస్, హెచ్‌ఎండిఎ, ఎఎస్‌సిఐ అధికారులు ఉన్నారు.

ఆపత్కాలంలో ప్రజలను ఆదుకోండి

- జూమ్ మీటింగ్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపత్కాలంలో ప్రజలను ఆదుకోవాలని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తీవ్రమైన వర్షాలు వరద పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ క్యాడర్ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సహాయ, సహకారాలు అందించడంతోపాటు తగిన భరోసా కల్పించాలని కోరారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి ఆయన డిసిసి అధ్యక్షులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న రెండో విడత జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలను నియమించాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ ఆస్తుల వివరాలను గాంధీభవన్‌కు పంపించాలని సూచించారు. నెలాఖరు లోగా మండల కమిటీలు, సెప్టెంబర్ 15 వరకు గ్రామ కమిటీలను పూర్తి చేసి ఆ వివరాలను పంపించాలని కోరారు. పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షులను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోరీ' ఉద్యమాన్ని ప్రజల్లో ప్రచారం చేపట్టాలన్నారు.

ఓట్ చోర్ .. గద్దె చోడ్

ఎఐసిసి పిలుపుమేరకు 'ఓట్ చోర్...గద్దె చోడ్' అంటూ గురువారం రాత్రి ఎనిమిది గంటలకు జిల్లా కేంద్రాల్లో మాస్ క్యాండిల్ ర్యాలీలు నిర్వహించాలని మహేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గంతోపాటు జిల్లా కమిటీలు, ఎమ్మెల్సీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, బ్లాక్, మండల అధ్యక్షులతోపాటు అన్ని విభాగాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 22 నుంచి సెప్టెంబర్ 7 వరకు భారీ రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. దీంతోపాటు పాదయాత్రలు, వాహన ప్రదర్శనలు చేపట్టాలన్నారు. ప్రజలను భాగస్వాములను చేసి బిజెపి ఓట్ చోరీలపై నిలదీయాలని కోరారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు జాతీయ స్థాయిలో ఉద్యమ చేయనున్నట్టు తెలిపారు. నెల రోజుల పాటు గడప, గడపకు తిరిగి సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఐదు కోట్ల సంతకాల సేకరించాలన్నారు.

ప్రతి ఇల్లు మాతృ భాష పాఠశాల కావాలి

- మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాషా సంస్కృతుల ప్రతీక
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ప్రజాశక్తి- కల్చరల్

మాతృ భాష కేవలం పరస్పరం సంభాషణ కోసం మాత్రమే కాదు జాతి సాంస్కృతిక చిరునామా అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ప్రతి ఇల్లు మాతృ భాష పాఠశాల కావాలని ఆయన చెప్పారు. బుధవారం తెలుగు విశ్వవిద్యాలయం ఎన్‌టిఆర్ కళా మందిరంలో మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం నిర్వహణలో సంస్కృతి పురస్కారాలు ప్రదానోత్సవం జరిగింది. మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాష సంస్కృతికి ప్రతీకని కొనియాడారు. ఆయన నిర్మలమైన ప్రజా సేవకుడు భాషా ప్రేమికుడు అన్నారు. దివి సీమ తుఫాన్ సందర్భంగా ఆయన చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని కలిపేందుకు ప్రపంచ తెలుగు మహా సభలు తొలి సారిగా జరిపి తెలుగు ఖ్యాతి ఇనుమడింప చేసారని వివరించారు. పురస్కారం అందుకున్న సత్యనారాయణ మల్లికార్జున్ తెలుగు ప్రాంతానికి దూరంగా స్థిరపడినా అక్కడ కష్ణారావు ఆశయాలకు అనుగుణంగా తెలుగు భాష సంస్కృతి వ్యాప్తికి కృషి చేస్తున్నారు అని అభినందించారు. అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు మాట్లాడుతూ దివిసీమ తుపాన్ కాల రాత్రిగా మారిన తరుణంలో ఒక్కడిగా నిలిచి పలు ధార్మిక సేవా సంస్థలను కూడగట్టుకుని బాధితులకి దిక్కుగా నిలిచిన కృష్ణారావు భాష సంస్కృతి కోసం చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. ఆయన కుమారుడు మండలి బుద్ధ ప్రసాద్ వివేక శీలి, తెలుగు భాషపై అపార ప్రేమ కలిగిన వారు అని చెప్పారు. తండ్రి పేరిట తెలుగు విశ్వవిద్యాలయంలో మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఏర్పాటు చేసి 2007 నుంచి రాష్ట్రేతర ప్రాంతాల లో విదేశాలలో తెలుగు భాష సంస్కృతి వ్యాప్తికి కృషి చేస్తున్న వారిని నగదు పురస్కారంతో సత్కరిస్తున్నారని తెలిపారు. మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ పురస్కార గ్రహీత సత్యనారాయణ అమెరికాలో తెలుగు భాషా సంస్కృతుల కోసం కృషి చేస్తున్నారని, పలు పరిశోధనా గ్రంథాలు సాహిత్య సంపుటులు ప్రచురించారని వివరించారు. మరో పురస్కార గ్రహీత మల్లికార్జున్ షోలాపూర్‌లో తెలుగు బాష సంస్కృతి వ్యాప్తికి సంస్థను ఆరంభించి చేనేత కార్మికుల సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ మాట్లాడుతూ మహాత్ములు పదవులు కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తారని అట్టి కృష్ణారావు జీవితం తర తరాలకు ఆదర్శం అన్నారు. పురస్కార గ్రహీతలు తెలుగు భాష సంస్కృతుల వికాసానికి ఇతర ప్రాంతాలలో చేస్తున్న కృషి విశేషం అన్నారు .

రాజ్యాంగాన్ని గౌరవించకుంటే బిజెపికి పరాభవమే : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగాన్ని గౌరవించకుంటే ఎప్పటికైనా పరాభవం తప్పదని బిజెపి గుర్తించాలని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం గవర్నర్ కోటాలో సిఫార్సు చేసిన ఎమ్మెల్సీల నియామకాలను నాటి గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని బిజెపి కుట్రపూరితంగా అడ్డుకుందని ఆమె విమర్శించారు. వారి నియామకం పెండింగ్‌లో ఉండగానే కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఇద్దరిని ఎమ్మెల్సీలుగా నియమించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ నియమించిన వారి శాసన మండలి సభ్యత్వాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం బిజెపికి చెంపపెట్టు అని తెలిపారు. ఇకనైనా రాజ్యాంగాన్ని గౌరవించి గవర్నర్, రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు ఆమోదం తెలపాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలపై రాజీలేనిపోరు

- ఇళ్లస్థలాల కోసం కొత్త విధానం తేవాలి
- సర్కారుకు టిడబ్ల్యుజెఎఫ్ విజ్ఞప్తి


సమావేశమైన టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై రాజీలేనిపోరాటం చేస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య అన్నారు. ఇండ్లస్థలాల విషయంలో ప్రభుత్వం కొత్త విధానం తేవాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ కార్మిక చట్టాల రద్దుతో కనీస వేతనాలను సైతం కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య మాట్లాడుతూ కొత్త అక్రిడిటేషన్ల ఇవ్వక దాదాపు సంవత్సరం గడస్తున్నదని గుర్తు చేశారు. కొత్త విధానం అమలుతో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో వేజ్ బోర్డు అమలు చేయకుండా తాత్సారం చేయడాన్ని ఖండించారు. కార్మిక శాఖ ఇందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. గతంలోని సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. మహిళా జర్నలిస్టులకు రాత్రిపూట పనిచేసే సంస్థ నుంచి ఇంటి వరకు రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఉపాధ్యక్షులు రాంచందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమాచార శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు గత కార్యకలాపాల నివేదికను ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య సమర్పించారు. చర్చల అనంతరం జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం పలు తీర్మాణాలు చేశారు. జర్నలిస్టులకు ఇండ్లస్థలాల కోసం కొత్త విధానం తేవాలనీ, మీడియా స్వేచ్ఛను కాపాడాలనీ, కొత్త అక్రిడిటేషన్లను మంజూరు చేయాలనీ, చిన్న, మధ్య తరహా పత్రికల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీసు బేరర్లు చంద్రశేఖర్, రాజశేఖర్, దయాసాగర్, తాటికొండ కృష్ణ, వెంకటేష్ గుడిగ రఘు, సలీమ, జగదీష్, వెంకటేష్, నిరంజన్, బిక్షపతి, మణిమాల, నాగవాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలవాలి

- బిఆర్‌ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల కష్టకాలంలో వారికి అండగా ఉండాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పార్టీ నేతలతో ఆయన మాట్లాడారు. అనేక ప్రాంతాలు జలమయమై, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో బిఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు వర్ష బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అన్ని రంగాల్లో విఫలమైన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నా లేకపోయినా, ప్రతిపక్షంగా మన బాధ్యత ఎక్కువని ఆయన గుర్తుచేశారు. కార్యకర్తలు వెంటనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి త్రాగునీరు, పాలు, ఆహారం, మందులు, బట్టలు వంటి కనీస అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. అత్యవసర వైద్య అవసరాల కోసం కూడా అవసరమైన చోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల్లో స్థానిక ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కెటిఆర్ సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దనీ, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వరద నీరు నిలిచిన ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఇప్పటికే వరద వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఇబ్బందులు పడుతుండడం పైన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ జిల్లాలకు చెందిన పార్టీ లీడర్లు, శ్రేణులు సహాయక చర్యల్లో మరింత చొరవ చూపాలన్నారు. ప్రజలకు బిఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందనీ, వారంతా ధైర్యంగా ఉండాలని కేటీఆర్ భరోసానిచ్చారు.


సముద్రంలోకి గాలం వేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

'కేసరి'లో మంత్రి జూపల్లి చేపల వేట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం కేసరి సముద్రంలో ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు చేపలు పట్టేందుకు గాలం వేశారు. నాగర్‌కర్నూల్ పట్టణ పురపాలక పరిధిలోని కేసరి సముద్రం వద్ద కొంతమంది యువకులు బుధవారం గాలాలతో చేపలు పడుతుండటాన్ని దారిలో వెళ్తూ చూసిన మంత్రి వాహనం ఆపించారు. వారివద్దకు వెళ్లి చేపలు పడే విధానం, పట్టిన చేపల పరిమాణం, ఈ కాలంలో చేపల లభ్యత వంటి విషయాల గురించి మంత్రి జూపల్లి ఆరా తీశారు. గాలంతోపాటు వలను కూడా నీటిలో విసిరి చేపలు పట్టే ప్రయత్నం చేశారు. తరువాత అక్కడే చెరువు కట్టపై చేపలు అమ్ముకుంటున్న వారిని కలిసి జీవనోపాధి, చేపల ధరలు, మార్కెట్‌లో డిమాండ్, వేట సమయంలో ఎదురయ్యే సమస్యల గురించి తెలుసుకున్నారు.

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాసిన స్క్రిప్టును చదువుతున్నారు

- కేంద్ర ఎన్నికల కమిషన్‌పై జగ్గారెడ్డి విమర్శలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాసిన స్క్రిప్టును కేంద్ర ఎన్నికల కమిషనర్లు చదువుతున్నారని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ అడుగుతున్న ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పడం లేదన్నారు. కనీసం ఆయన చేసిన విమర్శలపై విచారణ చేయడం లేదని విమర్శించారు. బిజెపి పార్టీ ఓట్ల చోరీ విషయంలో ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఉండకూడదనేది బిజెపి కుట్ర అన్నారు. రాహుల్ గాంధీకి ప్రధాని పదవేమీ కొత్త కాదనీ, ఆ పదవి వారి ఇంటిలో పుట్టిందని గుర్తుచేశారు. ఓటుహక్కు లేకుండా చేయాలన్నదే బిజెపి ఆలోచన అని చెప్పారు. దొంగ ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చిన బిజెపి ఇప్పుడు దేశ ప్రజల స్వేచ్ఛను అణగదొక్కే కుట్ర చేస్తున్నదని విమర్శించారు. మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి బిజెపి నాయకుడా, ఎన్నికల కమీషనరా అర్థం కాలేదని తెలిపారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ఓ ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ ఇచ్చిన చిట్టీ తీసుకుని చదివారని ఆయన ఎద్దేవా చేశారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం

- టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అప్రమత్తంగా ఉన్నట్టు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు సెలవులు రద్దు చేసినట్టు చెప్పారు. ఇంజినీర్లు, సిబ్బంది తప్పనిసరిగా హెడ్ క్వార్టర్‌లో 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కార్పొరేట్ కార్యాలయంతోపాటు, ఇతర జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో పని చేసే దాదాపు 200 మంది ఇతర విభాగాల అధికారులను, సిబ్బందిని క్షేత్ర స్థాయి ఆపరేషన్ సర్కిళ్లకు కేటాయించినట్టు వివరించారు. సంస్థ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఓ అండ్ ఎం సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. దీనికి తోడు గ్రేటర్ హైదరాబాద్ నగరంలో 213 సెక్షన్ ఆఫీసులకు చెందిన ఫ్యూజ్ కాల్ ఆఫీసుల్లో జిపిఎస్ ఆధారంగా పని చేసే అత్యాధునిక ఆటోలు, సంస్థ పరిధిలో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వీలుగా విద్యుత్ అంబులెన్సు తరహాలో 167 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వాహనాలు, సరిపడా సిబ్బంది పరికరాలతో అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుపై కింద ముద్రించిన అధికారులకుగాని, 1912కుగాని, స్థానిక ఎఫ్ఓసీకిగాని, కింది సూచించిన సర్కిళ్ల ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లకుగాని తెలియజేయాలని పేర్కొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరు మృతి

- ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల కారణంగా కారు అదుపుతప్పి కారు బోల్తా పడడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని గోకినేపల్లి గ్రామ సమీపాన ఉన్న జాతీయ రహదారి అండర్ పాస్ ఫ్లైఓవర్‌పై బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండల కేంద్రానికి చెందిన కొండబాల శ్రీనివాసరావు (65), పిండిప్రోలు గ్రామానికి చెందిన దొండేటి సాయిరంజిత్ కుమార్ (34) ఇద్దరూ కలిసి కారులో నల్లగొండ జిల్లా దామరచర్ల తాళ్లవీరప్పగూడెం గ్రామానికి బయలుదేరారు. గోకినేపల్లి జాతీయ రహదారి బ్రిడ్జి దగ్గరకు వెళ్లేసరికి భారీ వర్షం కారణంగా కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొనటంతో కారు నడుపుతున్న దొండేటి సాయి రంజిత్ కుమార్, పక్కనే కూర్చున్న కొండబాల శ్రీనివాసరావు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొండబాల శ్రీనివాసరావు అల్లుడు దొండేటి నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సిఐ వడ్డేపల్లి మురళి తెలిపారు.

లైంగిక దాడి కేసులో నిందితునికి 26 ఏళ్ల జైలు శిక్ష

- రూ.40 వేల జరిమానా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితునికి 26 సంవత్సరాల జైలు శిక్ష, రూ.40వేల జరిమానా విధిస్తూ ఎస్‌సి, ఎస్‌టి కోర్టు నల్లగొండ జిల్లా అదనపు జడ్జి-2 బుధవారం తీర్పు ఇచ్చినట్టు ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై గ్యారల శివకుమార్ లైంగికదాడికి ఒడిగట్టాడు. బాధితురాలి ఫిర్యాదుతో అతనిపై పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేశారు. మంగళవారం కోర్టుకు హాజరు కాకపోవడంతో శివకుమార్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. వన్ టౌన్ పోలీసులు బుధవారం నిందితున్ని పట్టుకొని కోర్టులో హాజరు పరిచారు. నల్లగొండ జిల్లా అదనపు జడ్జి-2, ఎస్‌సి, ఎస్‌టి కోర్టు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు నిందితునికి 26 ఏండ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ టౌన్ సీఐ గోపి, వన్‌టౌన్ ప్రస్తుతం సిఐ, రాజశేఖర్ రెడ్డి, పిపి వేముల రంజిత్ కుమార్, సిడిఓ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సిబ్బంది రబ్బానీ, శంకర్, షకీల్, శ్రీకాంత్, సైదులు, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన, లైజన్ అధికారులు, పినరేందర్, ఎన్.మల్లికార్జున్‌ను ఎస్‌పి అభినందించారు.